క్లుప్తంగా

కాట్రెవ్‌పల్లిలో ఉర్సు



మక్తల్: మండలంలోని కాట్రెవ్‌పల్లి గ్రామంలో మహిబూబ్‌సాహనీ ఉర్సు ఉత్సవాలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. భక్తులు మొక్కలు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సుజాత, గడ్డం నర్సప్ప, ఆంజనేయులు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వెండి పాదుకల అందజేత

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని దుప్పట్‌గట్ గ్రామానికి చెందిన మహిళలు గ్రామంలో మహిబూబ్‌సుహానీ దర్గాకు వెండి పాదుకలను, వెండి సామగ్రిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వాటితో ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సింగార్‌బేస్‌లో శివపూజ

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సింగార్ బేస్‌లో శివపూజా కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్పదీక్ష సేవా సమితి అధ్యక్షులు కాకర్ల భీమయ్య, మాజీ కౌన్సిలర్ నారాయణమ్మ దంపతుల ఇంట్లో సోమవారం పూజ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

మరికల్: మండల కేంద్రంలో నూతన హంగులతో నిర్మిస్తున్న మాత మాణికేశ్వరీ ఆలయ నిర్మాణానికి చిన్నారి బాలుడు సాయిప్రీతం సోమవారం రూ. 10 వేల సాయం చేశాడు. డబ్బులను ఆలయ పూజారి తిప్పన్నకు అందజేశాడు. కొండయ్య, శేఖర్ పాల్గొన్నారు.

శివాలయానికి ఉపసర్పంచ్ సాయం

అప్పంపల్లిలో శివాలయ పునర్‌నిర్మాణ పనుల నిమిత్తం ఉపసర్పంచ్ రాజేశ్వరమ్మ రూ. 16 వేలు ఆర్థిక సాయం చేశారు.

నేడు సమావేశం

నారాయణపేట రూరల్ : భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చా జిల్లా సమావేశం మంగళవారం ఉదయం 1 గంటలకు పట్టణంలోని ఆర్‌పీఆర్ గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకురాలు లక్ష్మి తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి హాజరవుతున్నారని, మహిళలు హాజరు కావాలని కోరారు.

దాబాలో పేలిన సిలిండర్లు

మక్తల్: పట్టణంలోనిని నారాయణపేట్ రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి సమయంలో మక్తల్‌కు చెందిన పాండు దాబాలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. వాటిల్లో ఉన్న రెండు సిలిండర్లు పేలడంతో మంటలు వచ్చాయి. దాదాపు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

‘బీజేపీతోనే అభివృద్ధి’


నారాయణపేట రూరల్ : కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే త్వరితగతిన అభివృద్ధి జరుగుతుందని, రాబోవు ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగురావు నామాజీ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం కోయిలకొండ మండలానికి చెందిన పలువురు యువకులు, ఇతర పార్టీల నాయకులను కాశాయ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్‌ను ఇంటికి పంపాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ రతంగపాండురెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రభాకరవర్ధన్, కేశవ్, మహబూబ్‌అలీ, కరుణాకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, విష్ణు, చెన్నయ్య పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ బృందం దాడులు

నారాయణపేట రూరల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం ఆపరేషన్ స్మైల్ బృందాలు విస్తృత దాడులు నిర్వహించారు. 10మంది బాలకార్మికులను గుర్తించారు. సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. తదుపరి పిల్లలు, వారి తల్లిదండ్రులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పర్చి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు ఎస్పీ చెప్పారు.

లింగ హోన్నయ్య రథోత్సవం

కృష్ణా : గుడెబల్లూర్‌లో లింగ హోన్నయ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తుల సమక్షంలో, వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా రథోత్సవంను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ధార్మిక సమావేశంలో బంధనళ్ పీఠాధిపతి శ్రీ వృషభలింగేశ్వర మహాస్వామి, నేరడగం పీఠాధిపతి శ్రీ పంచమ సిద్ధలింగ మహాస్వామి, కడెచూర్ పీఠాధిపతి శ్రీ గురుమూర్తి శివాచార్య మహాస్వామి సందేశాలను అందించారు. సర్పంచ్ మహాదేవమ్మ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీ నారాయణ, వెంకటేష్, సిద్రాంరెడ్డి, చిదానంద్, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, డాక్టర్ సంగమేశ్వర, మాజీ సర్పంచ్ ఆంబ్రేష్ పాల్గొన్నారు.



సమస్యలతో సతమతం

- గ్రామాలలో కనీస సౌకర్యాలు కరువు
- అస్తవ్యస్తంగా డ్రైయినేజీ వ్యవస్థ
- గుంతలమయంగా రహదారులు
- ఎండిపోతున్న హరితహారం మొక్కలు
- పట్టించుకోని అధికారులు



మట్టిరోడ్డును చూయిస్తున్న గ్రామస్తులు



నిరుపయోగంగా జీర్ణహళ్లి పాఠశాల భవనం

ఊట్కూర్: మండలంలోని ఆయాగ్రామాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. కనీస సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. సరైన రహదారులు లేకపోవడం, నీటి సరఫరాల సరిగా చేయకపోవడం, హరితహారం మొక్కలను పట్టించుకోకపోవడం వంటి అనేక సమస్యలు గ్రామాలలో దర్శనమిస్తున్నాయి. పెద్దపొర్ల పంచాయతీ పరిధిలోని జీర్ణహళ్ళి పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. మండల కేంద్రానికి 6 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలు ఇలా..

ఉపాధ్యాయుడు డిప్యూటేషన్ వేరేచోట విధులు నిర్వహిస్తుండడంతో పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది.

మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మించినా నీటి నీటి సరఫరా లేకపోవడంతో వృథాగా మిగిలిపోయింది. గ్రామంలో పారిశుద్ధ్య పనులు అంతంత మాత్రంగా ఉండడంతో వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

గ్రామంలో ఆయా వీధులలోని వీధి బల్బులు వెలగడం లేదు.

గ్రామానికి సరైన రహదారి లేదు. ఉన్న మట్టిరోడ్డు సైతం గుంతలమయంగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో వివిధ పనులపై ఇతర గ్రామాలకు వెళ్లేవారు మొగ్దంపూర్ బీటీ రోడ్డు వరకు కాలినడకన వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలకోసం ఎద్దుల బండ్లపై వెళ్తున్నామని వాపోతున్నారు. అదేవిధంగా హరితాహారంలో నాటిన మొక్కలకు నీరు పట్టకపోవడంతో ఎండిపోతున్నాయని పట్టించుకునేవారే కరువయ్యారని చెబుతున్నారు. గ్రామంలో 30 జాబ్ కార్డులు ఉన్నా పనికల్పించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇతర గ్రామాలకు వెళ్ళాల్సివస్తే 2 కి.మీ. బీటీ రోడ్డు వరకు కాలినడన వెళ్లాల్సివస్తుంది. రోడ్డుపై ముళ్లపొదలు, గుంతలు ఉన్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాల నిరుపయోగంగా మారడంతో పిల్లలను ఇతర గ్రామాల్లో చదివిస్తున్నాం.

– హన్మంతు, జీర్ణహళ్ళి

ఇబ్బందులు పడుతున్నాం



గ్రామంలో పారిశుద్ధ సమస్యలు తలెత్తడంతో ఇబ్బందులు పడుతున్నాం. మంచి నీటి ట్యాంకు చుట్టూ పరిశుభ్రత లోపించి దుర్వాసన వస్తోంది. వీధి బల్బులు వెలగడం లేదు. హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. ఉపాధి కూలీలకు పనికల్పించడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యలు పరిష్కరించాలి.

–బసప్ప, జీర్ణహళ్ళి

సమస్యలు పరిష్కరిస్తాం

గ్రామంలో ఉన్న సమస్యలు పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తాం. ఉపాధిహామి పథకంలో రోడ్డు పనులు చేపడుతాం. వీధి బల్బులు ఏర్పాటు చేయిస్తాం. పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

–కాళప్ప, ఎంపీడీఓ, ఊట్కూర్

మహాధర్నా కరపత్రాల విడుదల

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దును కోరుతూ మరికల్ బస్టాండ్ ఎదుట ఈ నెల 20న చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సోమవారం కంపెనీ వ్యతిరేక కమిటీ సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు. అధిక సంఖ్యలో మరికల్ గ్రామస్తులు తరలివచ్చి తమకు మద్దతు పలకాలని కోరారు. కమిటీ సభ్యులు లక్ష్మయ్య యువక మండలి అధ్యక్షులు రవికిరణ్, ఆంజనేయులు, రవి, రాజు, మల్లయ్యలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మక్తల్: తాపీమేస్త్రీల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్ని గోపి, ఉపాధ్యక్షుడిగా ఎలిగండ్ల బాలప్ప తదితరులు ఎన్నికయ్యారు. వెంకటేష్, రాంరెడ్డి, క్రిష్ణ, తోకరాజు, అనిల్, తాయప్ప, కొండయ్య,శివాజీ, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్‌ఎస్‌ఎస్‌తో క్రమశిక్షణ’

దామరగిద్ద: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ కార్యకర్తలను క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దుతుందని ముఖ్యవక్త తెలంగాణ ప్రాంత కార్యకారిని రొయ్యల రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని సర్వాపూర్ గ్రామంలో ఆర్‌ఎస్‌ఎస్ గ్రామశాఖ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరైమాట్లాడారు. అంతకుముందు భారతమిత చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వీరప్ప, ఎంపీటీసీ కొండప్ప, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ హన్మంతు, ముఖ్య శిక్షక్ శీను, శివ, మైపాల్, మోహన్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మాగనూర్‌లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి



కోస్గిలో బహుమతులు అందజేస్తున్న నాయకులు



ఖానాపూర్‌లో..



ఎల్లంపల్లిలో ట్రోఫీని అందుకుంటున్న విజేతలు

నారాయణపేట టౌన్ : బీజేపీ జిల్లా కోశాధికారి సిద్ది వెంకట్రాములు, గీతా సెల్ నాయకులు శ్యామ్‌సుందర్ గౌడ్‌లు సోమవారం సుభాష్‌రోడ్‌లోని 1,14, 15 వార్డులకు సుభాష్ చంద్రబోస్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను బోస్ చిత్రపటానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

మక్తల్: ఖానాపూర్ గ్రామంలో జిల్లాస్థాయి నిర్వహించిన కబడ్డీ పోటీలలో విజేతలకు సోమవారం సర్పంచ్ నర్సిములు బహుమతులను ప్రదానం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం, పీఈటీలు వెంకటేష్, నర్సిములు, అంజప్ప, వెంకటేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: బీజేపీ మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, కాంగ్రెస్ నేత మల్లేష్‌లు చెన్నారంలో యువకులు ఓపెన్ టూ ఆల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.

మాగనూర్: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటామని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి, మాగనూర్ సర్పంచ్ రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వీజేఆర్ ప్రజాసేవ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, నేటి ఓటమి, రేపటి విజయానికి నాంది అని అన్నారు. కార్యక్రమంలో మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ, రాంచందర్, రాంగోపాల్‌శెట్టి, కృష్ణ, రమేష్, నవీన్, బాలు తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: సర్పంచ్ నిర్మల, వైస్ ఎంపీపీ, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని విఠలపూర్ గ్రామంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, ఎక్సైజ్ సీఐ గోపాల్, రఫీ పాల్గొన్నారు.

నర్వ: ఎల్లంపల్లిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి వనపర్తి జిల్లా మూలమల్ల, ద్వితీయ బహుమతి నారాయణపేట జిల్లా పెద్దకడ్మూర్, తృతీయ బహుమతి పేట జిల్లా బెక్కర్‌పల్లి, చతుర్థ బహుమతి జోగుళాంబ గద్వాల జిల్లా గార్లపాడు జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. విండో వైస్ చైర్మెన్ లక్ష్మన్న, దండు అయ్యప్ప, చెన్నప్ప, ఎం.రవిలు బహుమతులకు సహకారం అందించారు. గ్రామ హనుమాన్ యువజన సంఘం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెరువు నీటిని వదలాలి



మాగనూర్: కొల్పూర్‌లో ఉన్న ఊర చెరువు వలన దుర్వాసన వ్యాపిస్తోందని గ్రామస్తులు సోమవారం ఆందోళనకు దిగారు. సమీపంలోని ఇళ్లలోకి పాములు వస్తున్నాయని, దోమల వల్ల చాలామంది అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. నీటిని దిగువకు విడుదల చేయాలని గ్రామసభలో తీర్మానం చేసినా స్పందన లేదని పేర్కొన్నారు. చెరువులోని మొసళ్లు పశువులను చంపేస్తున్నాయని సమస్య పరిష్కరించాలన్నారు. చేశారు. అడ్వకేట్ రాజు, స్వామిగౌడ్, పోతుల రాము, జంగందత్తు, కురువ తిమ్మన్న, వెంకటప్ప పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరి గోడ వద్ద అక్రమంగా నిర్మించిన ఇంటిని తొలగించాలని గ్రామ యువకులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు స్థానిక తహసీల్దార్ వాసుదేవరావుకు వినతిపత్రం అందజేశారు. కొందరు మతం మారినా గతంలో ఉన్న కులం ధ్రువపత్రాలను పొందుతున్నారని ఆరోపించారు. అశోక్‌గౌడ్, వంశీ, నాగరాజు, శివ, నవీన్, అభిలాష్, రితేష్, వంశీ, పావన్ పాల్గొన్నారు.



కృష్ణానదిలో స్నానాలు



కృష్ణా: సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం వేలాది మంది ప్రజలు కృష్ణానదికి తమతమ వాహనాలతో పాటూ ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. మండలంలోని ముడుమాల్ గ్రామంలో కర్ణాటకకు చెందిన భక్తులు పున్య స్నానాలను ఆచరించారు. అదే విధంగా కృష్ణా, తంగిడిలోని పుష్కర ఘాట్‌లలో కూడా ఉదయం నుంచే భక్తులు నది స్నానానికి తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండగా అక్కడి నాయకులు తగు ఏర్పాట్లు చేశారు.

రేషన్ బియ్యం పక్కదారి!



మాగనూర్‌లోని ఓ రైస్‌మిల్లులో పట్టుబడిన డీసీఎం

మాగనూర్: మండలంలోని రైస్‌మిల్లుల నుంచి రేషన్ బియ్యం యథేచ్ఛగా కర్ణాటకకు తరలుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం రైస్‌మిల్లులకు వరంలా మారిందని పలువురు అంటున్నారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యంను గుర్తించి రైస్ మిల్లుల యాజమానులను ప్రశ్నిస్తుంటే రిజక్టు బియ్యం బయటకు పంపిస్తున్నామని దాటవేత సమాధానంతో చెబుతున్నారని అంటున్నారు. డీసీఎంలలో 25 కేజీలు, 50 కేజీల బస్తాలతో బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. సోమవారం కూడా ఇదే విధంగా డీసీఎంలలో రేషన్ బియ్యంను తరలిస్తుండగా గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు స్పందించి రెండు డీసీఎంలను మాగనూర్‌లోని ఓరైస్ మిల్లులో గుర్తించి పోలిస్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై సీనియర్ అసిస్టెంట్ సురేష్ వివరణ ఇస్తూ స్థానికంగా ఉన్న ఓ రైస్ మిల్లులో రెండు డీసీఎంలలో 25, 50 కేజీల బ్యాగులలో బియ్యం లోడ్‌లను పట్టుకున్నామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందిచామని వారు మంగళవారం వచ్చి వాటిని పరిశీలించాక ఈ మేరకు అక్రమ రేషన్ బియ్యం అన్ని తెలితే రైస్‌మిల్లు యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలపారు.

జవాన్ల సేవలు ఎనలేనివి



సైనికులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నారాయణపేట రూరల్ : భారత సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో సోమవారం ఆర్మీడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన పలువురు సైనికులు ప్రకాష్ (ధన్వాడ), రాజు (తిప్రాస్‌పల్లి), ఆంజనేయులు (మంథన్‌గోడ్), చెన్నప్ప, మొగులప్ప, చంద్రశేఖర్ (బాపన్‌పల్లి), ప్రకాష్‌బాబు (నారాయణపేట)లను శాలువాతో సన్మానించి, దేశ భద్రత విషయంలో చేస్తున్న కృషిని ప్రశంసించారు. అనంతరం దేశ రక్షణలో వీర మరణం పొందిన జవాన్లకు 2నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో లయన్ గవర్నర్ హరినారాయణబట్టడ్, క్లబ్ అధ్యక్షులు మొల్గాన్ జనార్దన్, ఆత్మారామ్, శ్రీనివాస్, సదానంద్, భీంచందర్ పాల్గొన్నారు.

ఆర్మీడే సందర్భంగా వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలోని చిల్డ్రన్స్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. సైనికుల సేవలను కొనియాడారు. నాయకులు గందె సుమిత్, అకాడమీ సభ్యులు అంబిక, బాలు, నగేష్ పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ ఏర్పాట్ల పరిశీలన

మరికల్: కంటి వెలుగు నిర్వహణకు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గదుల ఏర్పాట్లను ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ వీణావాణీ పరిశీలించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించామన్నారు. వీటిలో సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఎంపిక చేసి కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ గోవర్ధన్, ఎంపీఓ బాలజీ, కార్యదర్శి శ్రీనివాస్ రావు, సూపర్‌వైజర్ అరవింద్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

బసవన్నలకు ప్రత్యేకపూజలు



కళాకారులను అభినందిస్తున్న సర్పంచ్

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో ఆదివారం, మరికొందరు సోమవారం కనుమ పండగ ఎంతో వైభవంగా జరుపుకున్నారు. రైతులు, ప్రజలు తమ తమ ఇష్ట దైవాన్ని ప్రార్థిస్తూ పశువులను, గోవులకు నైవేద్యం సమర్పించి ప్రత్యేకంగా ఆరాధించారు. పాడిపంటలు చేతికొచ్చే విధంగా దీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. చిన్నారులు, యువకులు గాలి పటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా పండుగ వేడుకలను జరుపుకున్నారు.

మక్తల్: సంక్రాంతి కనుమ సందర్భంగా మక్తల్ పట్టణంలో శివాజీ నగర్‌లో బీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం భరతమాత, బలరాముని చిత్ర పటాలకు పులమాలలు వేసి పూజ కార్యక్రమం చేశారు. అనంతరం గోమాత, బసవన్నలకు ప్రత్యేక పూజలు చేశారు. మండల ఏఓ మిథిన్‌చక్రవర్తి రైతులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, జిల్లా అధ్యక్షుడు వావలి వెంకటేష్, భీంరెడ్డి, సత్యనారాయణగౌడ్, ప్రతాప్‌రెడ్డి, కాశేశ్వర్, కర్నిశ్రీనివాసులు, సంజీవరెడ్డి, కుర్మయ్య, రామేశ్వర్‌రెడ్డి, వడ్ల బసప్ప, చెన్నప్ప, బీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటకం

ఊట్కూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని మల్లేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. గ్రామంలోని యువకులు వీరాభిమన్య నాటకాన్ని నెలరోజుల పాటు ప్రాక్టీస్‌చేసి ఆదివారం రాత్రి ప్రదర్శించారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ప్రదర్శించిన వివిధ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి సర్పంచ్ మాణిక్యమ్మ చేతుల మీదుగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో నాయకులు కతలప్ప, మల్లేశ్, రాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గాలిపటాల ఎగురవేత

కోస్గి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఏకో ఫ్రెండ్లీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాలి పటాల ఎగరవేత పోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో గౌతమ్ గౌడ్, వసీం అక్రమ్ జూనియర్ విభాగంలో బన్నీ బహుమతులు అందుకున్నారు. నాగరాజ్, శ్రవణ్ కుమార్, వీరుమల్లేష్, అరుణ్ కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.



అలరించిన ముగ్గుల పోటీలు



పేట మడి ఏరియాలో ముగ్గులు వేస్తున్న మహిళలు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని ధూల్‌పేట అంబాభవాని మందిర్ ఆవరణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఎస్ఎస్‌కె సమాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుతులను అందజేసి అభినందించారు. ఎస్‌ఎస్‌కె సమాజ్ పెద్దలు, మహిళ మండలి సభ్యులు, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : మూడు రోజుల సంక్రాంతి వేడుక నారాయణపేట ప్రజలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రత్యేక వంటకాలు చేసుకుని ఆనందంగా గడిపారు.

కోస్గి: గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి నెలకొంది. మహిళలు వేకువజామునుంచే ఇళ్ల ముంగిట కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులను వేస్తూ పండగ సంబరాలు జరుపుకున్నారు.

మక్తల్: సంక్రాంతి వేడుకలలో భాగంగా పట్టణంలో సోమవారం కనుమ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని వల్లభాపురం పుష్కరఘాట్ వద్ద భక్తులు పుణ్యక్షేత్రాన్ని దర్శించుకొని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

ఊట్కూరు: కొత్తపల్లి గ్రామంలో రెండు రోజుల పాటు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. సర్పంచ్ శాంతమ్మ, నాయకులు పాల్గొన్నారు.

మరికల్: తీలేర్‌లో శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ రేవతమ్మ బహుమతులను అందజేశారు.

నర్వ: లంకాల్ గ్రామంలో బీసీఎస్ యువసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. నగదు బహుమతులు అందజేశారు. బీసం చెన్నయ్యసాగర్, కోట్ల శ్రీనివాస్, రవికుమార్‌సాగర్‌లతో పాటు నాయకులు వీరేష్, ఆనంద్, రమాకాంత్, ధనుంజయ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, నరేష్‌యాదవ్, కృష్ణయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తీలేర్‌లో..



గోపాల్‌పేటలో..



కోస్గిలో..



లంకాల్‌లో బహుమతులతో విజేతలు